పోలీసుల సేవలపై క్యూఆర్ కోడ్‌లో అభిప్రాయాలను తెలుపాలి : ఎస్పీ

క్యూఆర్ కోడ్‌ను అవిష్కరిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, జనవరి 9: జిల్లాలో పోలీసులు అందిస్తున్న సేవలపై జిల్లా ప్రజలు తమ అభిప్రాయాలను ప్రత్యేకంగా రుపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వెల్లడించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. గురువారం తన చాంబర్‌లో పోలీస్ యంత్రాంగం రుపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల పని తీరును తెలుసుకునేందుకు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను రుపొందించిందన్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేయడం, ఎఫ్ఐఆర్ నమోదు, ఈ చాలన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ ఇతర అంశాలను కోడ్ ద్వారా తెలియపర్చవచ్చున్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్‌లలోఈ కోడ్ అందుబాటులో ఉంటుందని ఎవరైనా పోలీసుల సేవలపై అభిప్రాయాన్ని తెలియజేయవచ్చున్నారు. ముందు క్యూఆర్ కోడ్‌ను ఓపెన్ చేసి తరువాత తమ అభిప్రాయాన్ని https:// qr.me-qr.com/a ZMTxHDm లింకులో పంపు పర్చాలని తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన

చందంపేట : తామ్మాపురంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘువీర్, ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట, జనవరి 9 : చందంపేట, నేరేడుగొమ్ము మండలంలో సుమారు రూ.8.75 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. నాయిని జమునామాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వేణుధర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, సిరాజ్‌ఖాన్, మాజీ ఎంపీపీలు బిక్కూనాయక్‌పాల్గొన్నారు.

డిండి : అదే విధంగా మండల కేంద్రంలో స్త్రీనిధి, మత్స్యశాఖల ద్వారా సబ్సిడీతో మంజూరు చేసిన సంచార చేపల విక్రయ వాహనాలను ప్రారంభించారు. అంగడి బాజార్‌లో సిసిరోడ్డు నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నమూనా పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో 56మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన చింతరెడ్డి

ఎమ్మెల్సీ కవితతో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, జనవరి 9 : రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి నూనత సంవత్సర సుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నరేందర్, విజయ్‌కుమార్, అలీఫ్ ఉన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలి : డీపీఓ వెంకయ్య

మునుగోడులో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

మిర్యాలగూడ రూరల్, జనవరి 9 : గ్రామ పంచాయతీలు, ప్రభుత్వం హాస్టళ్లలో పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరిరావు అధ్యక్షతన మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండల పంచాయతీ కార్యదర్శులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిఇంటికీ, ప్రభుత్వ హాస్టల్‌కు శుద్ధి చేసిన తాగు నీటిని అందేలా చూడాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలకు కాపాడాలని, గ్రామాల్లో వీధి, పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకా వేయించాలన్నారు. గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓలు మాతంగి రమేశ్‌మోహిని, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడు : ప్రతి గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీపీఓ వెంకటయ్య అన్నారు. చండూరు, కనగల్, మునుగోడు మండలాలకు సంబంధించిన ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసూలు చేసిన పన్నులను ట్రెజరీలో జమచేసి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రాజశేఖర్ రెడ్డి

నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తులం సాయి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ రేఖ, నాగెల్లి సాయి, నరేశ్, అరవింద్, సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదువుకోవాలి : సుభాశ్

నిడమనూరు, జనవరి 9 : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదువుకోవాలని ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సుభాశ్ అన్నారు. మండలంలోని జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్‌లోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం పరీక్షల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, MOHAMMAD ABDUL SALEEM, S/o. Abdul Hussain, R/o. H.No.4-329, Vidyanagar Colony, Thripuraram, Village & Mandal, Nalgonda District, I have changed my name as MOHAMMED ABDUL SALEEM (New Name).

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

మెరుగైన వైద్య సేవలందించాలి

• కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ కేజీబీవీలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ, జనవరి 9 : గర్భిణులకు మొదటిసారి ప్రసవం చేసిన తరువాత కూడా మరోసారి పరీక్షించాలని, ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, స్టాఫ్, మందులు, వైద్య సేవలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి నిర్వహణ బాగాలేదని, పేషెంట్‌లకు వైద్యం సరిగా అందడం లేదని వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటీవల ఇక్కడ ఏడుగురు గర్భిణులు, బాలింతలు మృతి చెందారన్నారు. సీరియస్ ఉంటే వెంటనే జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖానకు రిఫర్ చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ఎస్టీ బాయ్స్ హాస్టల్, కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి వంట, తరగతి గదులను పరిశీలించారు. కేజీబీవీలోని 7వ తరగతి విద్యార్థులతో సైన్స్‌లోని వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లపై ప్రశ్నలు వేశారు. వైరస్ సోకడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ విద్యార్థులకు బోధించారు. ఆమె వెంట చండూరు ఆర్డీఓ శ్రీదేవి, తాసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకర్ నాయక్ ఉన్నారు.

ధరణితో ఇబ్బందులు ఉండొద్దు : కలెక్టర్

చండూరు : ధరణిలో ఎలాంటి సమస్యల్లేకుండా తాసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ధరణి మాడ్యూల్స్ అన్నింటిపై తాసీల్దార్‌కు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శన తరువాతే సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీదేవిని ఆదేశించారు.

సాగర్ డ్యామ్ భద్రతను ఎస్పీఎఫ్ డీజీపీ పరిశీలన

డ్యామ్ పైన భద్రతను పరిశీలిస్తున్న ఎస్పీఎఫ్ డీజీపీ అనిల్‌కుమార్

నందికొండ, జనవరి 9 : నాగార్జునసాగర్ డ్యామ్ పై ఉన్న ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఫోర్స్ చేపడుతున్న భద్రతను డీజీపీ అనిల్ కుమార్ గురువారం పరిశీలించారు. డ్యామ్, ఎర్త్ డ్యామ్, గ్యాలరీ, ప్రధాన జలవిద్యుత్ కేంద్ర, ఎడమ కాల్వ వద్ద ఎస్పీఎఫ్ బలగాలు చేపడుతున్న భద్రతను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతకు ముందు ఎస్పీఎఫ్ బలగాలు గౌరవ వందనం చేయగా ఏఎస్పీ రాములనాయక్, ఎస్పీఫ్ డిప్యూటీ కమాండెంట్ బ్రహ్మాచారి పూల మొక్కలతో స్వాగంతం పలికారు. వీరితో అసిస్టెంట్ కమాండెంట్ కోటేశ్వర్‌రావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ బీసన్న, ఎస్పీఎఫ్ ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

లూజ్ సిమెంట్‌ను రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్టు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నీలగిరి, జనవరి 9 : లారీ బంకర్ల నుంచి లూజ్ సిమెంట్‌ను అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి లారీ బంకర్‌తో పాటు రూ.4లక్షల విలువైన 1500 సిమెంట్ బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. చిట్యాలలో ఓ గోదామ్‌లో సిమెంట్ అన్‌లోడ్ చేస్తున్నట్లు నమ్మదగ్గ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, చిట్యాల పోలీసులు సంయుక్తంగా అక్కడకు వెళ్లగా బంకర్ నుంచి సిమెంట్ తీస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని చిట్యాలకు చెందిన గుండాల శ్రీను, గుండాల దుర్గయ్య, గుండాల నవీన్ అవినేని రమణయ్య, లింగస్వామి, పెరిక జయనరసింహారెడ్డిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరు వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది లారీ డ్రైవర్లతో కుమ్మక్కై గోదామ్‌ను ఏర్పాటు చేసుకుని చాలా కాలంగా బంకర్ల నుంచి లూజ్ సిమెంట్ తీసి ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ కంపెనీలకు చెందిన పేర్లతో బస్తాల్లో నింపి అక్రమంగా విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. బంకర్ల డ్రైవర్లు సిమెంట్ కంపెనీల వద్ద వెయింగ్ మిషన్‌లో పనిచేసే వారితో కలిసి 35 టన్నులకు నింపాల్సిన ట్యాంకర్‌ను 37-38 టన్నులు నింపుకొని డెలివరీకి ముందే అందులో అదనంగా తెచ్చిన సిమెంట్‌ను గోదామ్‌లో అన్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. వెయింగ్ మిషన్ వద్ద వీలు పడకపోతే బంకర్లలో సిమెంట్ తీసి అందులో రాళ్లు నీళ్ల డ్రమ్ములు వేసి యాజమాన్యానికి తక్కువ సిమెంట్‌ను అన్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. ఇలా ప్రతి లారీ బంకర్ నుంచి 2-3 టన్నుల సిమెంట్‌ను అక్రమంగా తీసి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. వీరంతా లూజ్ బంకర్ల ద్వారా తెచ్చిన సిమెంట్‌ను అక్రమంగా అమ్ముతూ ఇటు ప్రభుత్వానికి, ప్రజలకు, డీలర్లకు, కంపెనీలకు నష్టం చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఐదుగురిని అరెస్టు చేయగా రమణయ్య అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని వీరందరినీ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్ఐ రమేశ్, శివకుమార్, చిట్యాల ఎస్ఐ ధర్మా ఉన్నారు.

మునుగోడులో దొంగల హల్‌చల్

ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్

మునుగోడు, జనవరి 9 : మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత దొంగలు హల్‌చల్ చేశారు. సీసీ కెమేరాలకు చిక్కకుండా పక్కా ప్లాన్‌తో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని నాలుగు ఇండ్లలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి 11తులాలన్నర బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.1.15లక్షల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. చోరీ జరిగిన స్థలానికి క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ సేకరణ టీమ్ వచ్చి పరిశీలించారు. నల్లగొండ డీఎస్పీ శివరామ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నేరస్తుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. చండూరు సీఐ వెంకటయ్య, కనగల్, చండూరు ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత

• గ్రామానికి ఆదాయ మార్గం చూపాలని వంగమర్తి వాసుల నిరసన



ఇసుక తరలింపును అడ్డుకుంటున్న వంగమర్తి గ్రామస్తులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : తమ గ్రామం నుంచి ఇసుకను తరలిస్తూ తమకు ఎలాంటి ఆదాయం లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులంతా కలిసి ఇసుక తరలింపును అడ్డుకున్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వంగమర్తి గ్రామంలో ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న ఇసుక రీచ్ వద్దకు గురువారం వంగమర్తి గ్రామస్తులు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. మా ప్రాంతంలో ఉన్న కోట్ల సంపద(ఇసుక)ను కొల్లగొడుతూ మా పొట్ట కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్ నుంచి అడ్డూ అదుపు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని, అనమతుల పేరుతో ఇసుకంతా పక్కదారి పడుతున్నదని ఆరోపించారు. సుమారుగా రోజు 200 లారీలు, టిప్పర్ల ద్వారా అధిక లోడుతో ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు, ఇసుక తరలించే గుత్తేదారు పట్టించుకొని గ్రామ ప్రజలకు ఆదాయ మార్గం చూపించి ఇసుకను తరలించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : డిప్యూటీ కలెక్టర్ రాములు

హాలియా, జనవరి 9 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రాములు అన్నారు. గురువారం తాను చదువుకున్న హాలియా జడ్పీహెచ్‌ఎస్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాల పూర్వ హెచ్‌ఎం దివంగతీ రామానుజాచార్యుల ఆశీస్సులతో ఉన్నత విద్యను అభ్యసించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండా కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

మురుగు కాల్వలో వ్యక్తి మృతదేహం

చిట్యాల, జనవరి 9 : చిట్యాలలో గురువారం మురుగు కాల్వలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. హెడ్‌కానిస్టేబుల్ మోసిన్ పాషా తెలిపిన వివరాలు.. చిట్యాలలోని ముత్యాలమ్మ గూడెం ప్రాంతానికి చెందిన జావిద్ మహ్మద్(40) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మనం హైదరాబాద్ వెళ్లేది ఉందని భార్యకు చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో చుట్టుపక్కల వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. గురువారం ఉదయం 10వ వార్డు కౌన్సిలర్ సిలివేరు మౌనిక భర్త శేఖర్ పాత శివనేనిగూడెం రోడ్డులో ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం వెళ్లగా అక్కడ మురికి కాల్వలో జావిద్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు మృతుడి భార్య షాహినా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ క్రాంతికుమార్

నార్కట్‌పల్లి, జనవరి 9 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ క్రాంతికుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండుగలకు ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం వేసిన సంగతి తెలియకుండా కర్టెన్ వేసుకోవాలన్నారు. వెళ్లే ముందు ఇరుగు, పొరుగు వారికి సమాచారం ఇవ్వాలని, బంగారు ఆభరణాలు, నగదు ఇంట్లో పెట్టవద్దని సూచించారు.

సాఫ్ట్ బేస్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో లయోల విద్యార్థికి 3వ స్థానం

చిట్యాల, జనవరి 9 : మంచిర్యాల జిల్లాలో ఇటీవల నిర్వహించిన 9వ జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో పట్టణంలోని లయోలా టెక్నో స్కూల్‌కు చెందిన గోపగోని వివేక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎండీ జమీరుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఈనెల 13న జిల్లా స్థాయి ఎడ్ల బల ప్రదర్శన

అడవిదేవులపల్లి, జనవరి 9 : మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా నెల 13న గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త సూరప్రసాద్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతకు ప్రథమ బహుమతి రూ.25,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.5,116 అందించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9666 58801, 91219 43980 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మర్రిగూడ, జనవరి 9 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 94మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీదేవి అందించారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన...

తమకు సమాచారం ఇవ్వకుండా చెక్కులను ఎలా పంపిణీ చేస్తారని పలువురు కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీఓ స్పందిస్తూ ఇది అధికారిక కార్యక్రమమని ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సమాచారం ఇవ్వలేదన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మర్రిగూడ, జనవరి 9 : మండలంలోని ఖుదాభక్షిపల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శి నక్క పార్వతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా ఎక్కువ రోజులు సెలవు పెట్టడమే కాకుండా మరో పంచాయతీ కార్యదర్శికి రికార్డులు అప్పజెప్పలేదని, బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఇంటి పర్మిషన్ మంజూరులో ఆమె అవకతవలకు పాల్పడినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించినందుకు గాను కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య తెలిపారు.

నోముల సేవలు చిరస్మరణీయం : మాజీ ఎమ్మెల్యే భగత్

వేములపల్లి : వేంపాడ్‌లో నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్ కుమార్

నిడమనూరు, జనవరి 9 : బడుగుల అభ్యున్నతికి దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. నర్సింహయ్య 69వ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని వేంపాడ్ స్టేజీ వద్ద గల నర్సింహయ్య విగ్రహానికి పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటి సత్యపాల్, మాజీ ఎంపీపీ బొల్లం జయమ్మ, నాయకులు సాదం సంపత్ కుమార్, కామర్ల జానయ్య, అర్వ స్వాతి, బొల్లం రవి, చిలుముల సంతోశ్ తదితరులున్నారు.

నందికొండ : హిల్‌కాలనీలోని నెహ్రూ పార్కులో నోముల నర్సింహయ్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే భగత్ నివాళులర్పించారు.

నల్లగొండ రూరల్ : యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం భవన్‌లో నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజు, భవన ట్రస్టు చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, సమన్వయకర్త పల్లెబోయిన కాశీ రాములు యాదవ్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బల గోపాల కృష్ణ యాదవ్, అల్లి వేణు యాదవ్, చల్లా కోటేశ్, నాయకులు ఉన్నారు.

సంపదను దోచుకుంటున్న బీజేపీ : మంత్రి సీతక్క

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నందికొండ, జనవరి 9 : మత ముసుగులో, మనోధర్మ పేరుతో బీజేపీ గత పదేండ్లుగా సంక్షేమ పథకాలను పట్టించుకోకుండా సంపదను దోచుకుంటుందని మంత్రి సీతక్క విమర్శించారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ ప్రాజెక్ట్ హౌస్‌లో కొనసాగుతున్న ఆదివాసీ గిరిజన శిక్షణ తరగుతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ హరగోపాల్, కంచె అయిలయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా రెండో టర్బైన్

విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న రెండో టర్బైన్

నందికొండ, జనవరి 9 : నాగార్జునసాగర్ డ్యామ్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మరమ్మతులకు గురై గత ఏడాదిగా నిరుపయోగంగా ఉన్న రెండో టర్బైన్ పనులు గురువారంతో ముగిసి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. ఇందులో సాంకేతిక సమస్య తలెత్తడంతో 2వ టర్బైన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయింది. జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నవంబర్ నెలలో జపాన్ బృందం రావడంతో మరమ్మతులు ప్రారంభించారు. రెండు నెలల్లో మరమ్మతులు పూర్తి కావడంతో మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. విజయవంతం కావడంతో రెండో టర్బైన్ ద్వారా 100 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

రూ.30 లక్షల వ్యయంతో పనులు చేపట్టాం : సీఈ

రూ.30 లక్షల వ్యయ్యంతో 2వ టర్బైన్ మరమ్మతులను రెండు నెలల కాలంలో చేపట్టి విజయవంతంగా పూర్తి చేశామని సీటీ మంగేశ్‌కుమార్ తెలిపారు. గతేడాది వానకాలం సీజన్‌లో టర్బైన్ వాడకంలో లేకపోయినా విద్యుత్ ఉత్పత్తి టార్గెట్‌ను గడువు కంటే ముందుగానే చేరుకున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు జలవిద్యుత్ కేంద్రంలో 8 టర్బైన్లు విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీని డీఈఓ సందర్శన

కేజీబీవీ కిచెన్‌లో వంటలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

మునుగోడు, జనవరి 9 : మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈఓ భిక్షపతి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, డైనింగ్ హాల్, కిచెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఏటీడీఓ శ్రీనివాస్

పెద్దవూర, జనవరి 9 : విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఏటీడీఓ ఎం.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను, హాస్టల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.బాలోజి, వార్డెన్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో నల్లగొండ జిల్లాకు ప్రథమ బహుమతి

బహుమతి అందుకుంటున్న డీవీఎం కళాశాల ఛాత్రోపాధ్యాయులు

రామగిరి, జనవరి 9 : మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ఇన్‌స్పైర్ ప్రదర్శనలో నల్లగొండ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బీఈడీ కళాశాలల విభాగంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 16 కళాశాలలు టీచర్ లెర్నింగ్ మెటీరియల్స్ ప్రదర్శన చేశారు. కాగా రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి నల్లగొండ పట్టణంలోని చర్లపల్లిలో గల డీవీఎం కళాశాలకు దక్కింది. ఎడ్యుకేషన్ గైడ్ టీచర్ బొడ్డుపల్లి రామకృష్ణ, ఛాత్రో ఉపాధ్యాయులు పి.అన్నమ్మ, ఎస్. మౌనిక ప్రదర్శించిన లోకాస్ట్ బీఎల్ఎం విత్ వర్కింగ్ మోడల్ టీఎల్ ప్రదర్శనకు గాను ఈ బహుమతి అందుకున్నారు. అదే విధంగా టీచర్స్ ప్రాజెక్ట్ విభాగంలో 23 మంది చేసిన ప్రదర్శనలో చండూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన గెజిటెడ్ హెచ్ఎం ఆర్. సరస్వతి ప్రదర్శించిన టీఎల్ఎం ఎంపికైంది. వీరికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి, ఏసీ శివేంద్ర ప్రసాద్, డీఈఓ ప్రవీణ్‌కుమార్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.

పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి : ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నకిరేకల్ : తాసీలార్ కార్యాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి, పక్కన తాసీల్దార్ జమీరొద్దీన్

నకిరేకల్, జనవరి 9 : తాసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణ తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాసీల్దార్ ఎస్కే జమీరొద్దీన్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ధరణి ఆపరేటర్లు పాల్గొన్నారు.

మిర్యాలగూడ బస్టాండ్‌ను విస్తరించాలని డీఎంకు వినతి

మిర్యాలగూడటౌన్, జనవరి 9 : మిర్యాలగూడ బస్టాండ్‌ను విస్తరించాలని కోరుతూ బీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు చేగొండి మురళీయాదవ్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బస్టాండ్‌ను విస్తరించాలని, డిపోను పెద్దగా నిర్మించాలని కోరారు. బస్టాండ్ ఎదుట దుకాణాలు, కూరగాయల మార్కెట్, డాక్టర్స్ కాలనీ ఉండటంతో నిత్యం రద్దీగా మారి ట్రాఫిక్ పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేట్ అండర్ టేకింగ్ బస్సులను యాజమానులు వారి ఇంటి దగ్గరే పార్కింగ్ చేసుకోవాలని, జనాభాకు అణుగుణంగా వసతులు కల్పించాలని కోరారు. హైదరాబాద్‌కు గంటకో ఎక్స్‌ప్రెస్ బస్సును నడుపాలని కోరారు.